క్లుప్తంగా

సూర్యారాధన శ్రేయోదాయకం



విజయవాడ కల్చరల్: సూర్యారాధన శ్రేయోదాయకమని, నిత్య పూజలతో తరించాలని దెందుకూరు సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సూర్యారాధన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య శాస్త్రి సూర్యారాధన విశిష్టతను వివరించారు. భారతీయ ధర్మంలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందన్నారు. వేదాలలోనూ సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందని చెప్పారు. దేవాలయ ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లోక శాంతికోసం జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి ఆదేశాలతో సూర్యారాధన నిర్వహిస్తున్నామన్నారు. సూర్యారాధన, సూర్య నమస్కారాల వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని ఆదర్శ్ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామకృష్ణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ రామకృష్ణ మాట్లాడుతూ.. నీటి నిల్వలను పెంచుకుంటూ భావితరాల వారికి సురక్షితమైన నీటిని అందించాలన్నారు. భూమి మీద మానవులు జీవించడానికి నీరు ఎంతో అవసరమని చెప్పారు. జనాభా పెరిగే కొద్ది నీటి వినియోగం ఎక్కువై కొరత ఏర్పడుతోందన్నారు. నేడు 663 మిలియన్లకు పైగా ప్రజలు తమ ఇళ్ళకు సమీపంలో సురక్షితమైన నీటి సరఫరా లేక సంక్షోభంలో జీవిస్తున్నారన్నారు. భూమిపై ప్రాణాలు కాపాడేందుకు నీటిని ఆదా చేయడం మనందరి బాధ్యత అన్నారు. నీటి బ్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పీఎస్‌లో సీపీ ప్రత్యేక పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గంగా శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి వార్లకు పోలీస్ కమిషనర్ టీకే రాణా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో వెండి రథోత్సవం జరిగింది. అందులో భాగంగా రథోత్సవం పాతబస్తీ వీధుల మీదుగా బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ సీపీ ఇతర అధికారులు రథానికి స్వాగతం పలికారు. సీపీ టీకే రాణా , ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్ రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల అధికారులతో పాటుగా ఉన్నతాధికారులందరూ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకొని అమ్మవారి రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దేశ భవితకు యువత పాటుపడాలి

గుణదల(విజయవాడతూర్పు): దేశ భవిత యువతపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి పాటుపడాలని జెస్యూట్ ప్రావిన్స్ ప్రావెన్షియల్ ఫాదర్ కె.స్టానిస్లాస్ తెలిపారు. ఆంధ్రలయోల కళాశాల ఆవరణలో యూత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరిట ఐకానిక్ భవనం ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. యువతను చైతన్య వంతులుగా తీర్చిదిద్దటంలో విద్యా సంస్థలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మరో అతిథిగా హాజరైన విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులను నైతిక విలువలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. దీనిలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఐకానిక్ భవనాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనంతరం నూతన భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షడ్రుచుల సమ్మేళనం ఉగాది

- కిటకిటలాడిన దేవాలయాలు
- శాస్త్రోక్తంగా వసంత నవరాత్రులు ప్రారంభం
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



విశేష అలంకరణలో శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారు



పంచాంగం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, విజయ సుబ్రహ్మణ్యం తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. అనంతరం షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

మధురానగర్, మాచవరం, అయోధ్యనగర్, రామకృష్ణాపురం, దేవీనగర్, ముత్యాలంపాడు, తదితర ప్రాంతాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ముత్యాలంపాడు గ్రామ దేవత శ్రీ ఈశ్వరమ్మతల్లి అమ్మవారి దేవాలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలు, సత్తెనపల్లి కళాకారులు వీర భద్రపాలెం జానపద నృత్య ప్రదర్శనతో వీధుల్లో ఊరేగింపు సాగింది. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కార్యదర్శి డి.శివరామరాజు, కోశాధికారి సామంతపూడి గోవిందరాజు చిన్నా, చిరంజీవి పర్యవేక్షించారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి దాట్ల శివరామరాజు పర్యవేక్షించారు.

అయోధ్యనగర్‌లో..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠం శ్రీశివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో వసంత నవరాత్రులు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. సాయంత్రం పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు అందజేశారు.

బాబాకు ప్రత్యేక పూజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం నుంచి ప్రతి ఒక్కరి జీవితం శోభాయమానంగా సాగాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీషిర్డి నాగసాయిబాబా–శ్రీనాగమానసాదేవి మందిరంలో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. మందిరాన్ని సందర్శించి బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవార్లకు వివిధ రకాల పూలతో అభిషేకాలు చేశారు. బాబా భక్తులు కనకమేడల భరత్ భూషణ్, శివ పార్వతి దంపతులు బహూకరించిన వెండి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు హారతి అనంతరం భక్తులు బత్తిన శ్రీకాంత్, వెంకట దుర్గా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. జక్కిలంక రాజారావు బృందం బాబా కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, వెన్నం రత్నారావు పాల్గొన్నారు.

సనాతన ధర్మం కాపాడుకోవాలి

విజయవాడ కల్చరల్: సనాతన ధర్మం కాపాడుకోవాలని వేద పండితులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి అన్నారు. కంచికామకోటి పీఠపాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శోభకృతు నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా బుధవారం నిర్వహించిన వేద సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక వైభవం అంతా వేదనాదంతో నిండిఉందని వేదాలను సంరక్షించుకుంటే ధర్మాన్ని సంరక్షించుకున్నట్లుగా భావించవచ్చునన్నారు. దేవాలయ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి 7వ తేదీ వరకు వేద పరీక్షలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి హాజరై అనుగ్రహ భాషణ చేస్తారని చెప్పారు. వేదపండితులు చతుర్వేదాలను పారాయణం చేశారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. రేలంగి సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. దేవాలయంలో వెంకటేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): భారతీయ సంస్కృతిలో కోట్లాది మంది ప్రజలు పంచాంగ శ్రవణంను విశ్వసిస్తారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం అవరణలోని సీతారామ కళ్యాణమండపంలో శ్రీ కంచి కోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్యం వారిచే పంచాంగ శ్రవణ పఠనం నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి పాల్గొన్నారు. ఈ ఏడాదిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రకృతి సహకరించి సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం విజయ సుబ్రహ్మణ్యంను సత్కరించి దేవస్థాన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సీతారామయ్య, ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



బాబా మందిరంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



నాగమానసాదేవి అమ్మవారికి హారతిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వేదసభను నిర్వహిస్తున్న వేద పండితులు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చిన్నా, డీవీఎస్ రాజు



పంచాంగ శ్రవణం చేస్తున్న మాచిరాజు వేణుగోపాల్

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరికీ మంచి జరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక అయోధ్యనగర్ సూర్యఫిల్లింగ్ స్టేషన్‌లో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి దుప్పట్లు, దోమతెరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా తెలుగు సంవత్సరాది ఉగాదికి నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న సూర్యఫిల్లింగ్ స్టేషన్ అధినేత రంగబాబును ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిష్టా రామలింగమూర్తి, సూర్య ఫిల్లింగ్ స్టేషన్ అధినేత రంగబాబు, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, నాయకులు జి.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌ఆర్, పేరం త్రివేణి రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విగ్రహానికి సంబంధించి డిజైన్లను ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లతో పాటు పరిశీలించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మాణ పనులు జరగాలని ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె అంబేడ్కర్ విగ్రహ భాగాలు జాగ్రత్తగా నిర్మాణం చేయాలని, అనుకున్న సమయానికి అంబేడ్కర్ స్మృతివనం, ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులు సైతం సమయంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు విగ్రహం కింద భాగంలో రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, మిని థియేటర్, ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఆర్‌డీఏ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి



క్రీడా పరికరాలు అందజేస్తున్న మనీష్ లఖోటియా తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రౌండ్‌టేబుల్ ఇండియా జాతీయ అధ్యక్షుడు మనీష్ లఖోటియా అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా 68, లేడీస్ సర్కిల్ 52 సంయుక్త ఆధ్వర్యంలో ఆధునికీకరించిన శ్రీవిద్యా అప్పర్ ప్రైమరీ పాఠశాలను బుధవారం ఆయన పునఃప్రారంభించారు. పాఠశాలకు బెంచ్‌లు, తాగునీటి అవసరాల కోసం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. క్రీడా పరికరాలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా మనీష్ లఖోటియా మాట్లాడుతూ రూ.2 లక్షల వ్యయంతో పాఠశాలకు నూతన హంగులు సమకూర్చామన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రౌండ్‌టేబుల్ ఇండియా కృషి చేస్తోందని చెప్పారు. పాఠశాలలో 150 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామన్నారు. కార్యక్రమంలో రౌండ్‌టేబుల్ ఇండియా చైర్మన్ డాక్టర్ శ్రీహర్ష గుత్తికొండ, లేడీస్ సర్కిల్ చైర్ పర్సన్ డాక్టర్ ప్రశాంతి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ పరిరక్షణలో బాల బాలికలు భాగస్వాములు కావాలని శివజ్ఞానపీఠం పీఠాధిపతి శివచార్యస్వామి అన్నారు. శత సహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో శోభకృత్ ఉగాది వేడుకల సందర్భంగా చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామిజీ మాట్లాడుతూ.. బాల్యంలో సంప్రదాయాలు నేర్పించాలన్నారు. సేవా మండలి నిర్వాహకుడు నాగలింగం శివాజీ మాట్లాడుతూ సంస్థ ద్వారా ప్రతీ ఏటా కోటి దీపార్చనతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన కుంభ గాయత్రి వంట పనులు చేస్తుంది. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి భార్యను అనుమానించడం, వేధించడం చేస్తున్నాడు. ఆర్నెల్లుగా వేధిస్తుండడంతో గతంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది. కౌన్సెలింగ్‌కు పంపగా సక్రమంగా కాపురం చేసుకుంటామని అంగీకరించాడు. రెండు నెలలుగా మరలా వేధింపులు ప్రారంభించాడు. దీంతో ఆమె భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.





ఇంద్రకీలాద్రిపై శోభకృత్ సందడి

ఇంద్రకీలాద్రిపై శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందడి నెలకొంది. తెలుగు వారి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి బుధవారం తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఆలయ పాలక వర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.







దుర్గమ్మ సన్నిధిలో మజ్జిగ పంపిణీ ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రాంగణంలో బుధవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన మజ్జిగ పంపిణీని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ప్రారంభించారు. భక్తులు అందజేసిన విరాళాలతో మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. వేసవి కాలం పాటు మజ్జిగ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద ప్రదర్శిస్తామన్నారు. తొలి రోజున ఈఓ భ్రమరాంబ, కె.అమరేంద్ర, నూనె భవానీశంకర్, నాళం వెంకటేశ్వర్లు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, వద్దాది పాండురంగారావు, పర్నికలు విరాళాలను అందజేశారు.